సాక్షి
కాకినాడ

సోమవారం । 6 । నవంబర్ । 2023



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విష్ణుభట్ల వేగేశ్న సుబ్బరాజు, అనురాధ దంపతులు (భీమవరం) ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.




సర్వాంతర్యామి...సదా స్మరామి

శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాడపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీనివాస కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

8లో

9,300 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు ఆదివారం 9,300 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

అట్టడుగు వర్గాలకు.. అగ్రాసనం



సర్పవరం జంక్షన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కన్నబాబు, డీఎస్పీలు, నేతలు



సామాజిక సాధికార యాత్రకు సిద్ధమైన బస్సు

- సామాజిక సాధికారతకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సరికొత్త నిర్వచనం
- బడుగుల సంక్షేమం, అభివృద్ధిలో కొత్త ఒరవడి
- కేబినెట్ నుంచి రాజ్యసభ వరకూ పదవుల్లో వారికి ప్రాధాన్యం
- నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర
- కాకినాడ సర్పవరం జంక్షన్‌లో 4 గంటలకు బహిరంగ సభ
- ఆ వర్గాలకు చేసిన మేలును వివరించనున్న ప్రజాప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సామాజిక సాధికారత కేవలం రాజకీయ నినాదంగా కాకుండా బడుగు, బలహీనవర్గాలకు పాశుపతాస్త్రంగా మార్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కింది. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కేస్ట్ కాదు.. బ్యాక్‌బోన్ కేస్ట్ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్రికరణశుద్ధిగా నమ్మారు. అందుకే 'నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనారిటీలు' అనే మాటలకే పరిమితం కాకుండా.. ఆ వర్గాలను అన్నింటా ఉన్నత స్థితికి తీసుకువెళ్లడంలో ఆయన ఒక విప్లవాన్నే సృష్టించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వినూత్న సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచింది. ఒక్క పైసా అవినీతికి తావు లేకుండా కోట్లాది రూపాయలను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో విద్యా సాధికారతను సాకారం చేసింది. నామినేటెడ్ పదవుల నుంచి క్యాబినెట్, రాజ్యసభ వరకూ సింహభాగం పదవులను అట్టడుగు వర్గాలకు ఇచ్చి పరిపాలనలో వారిని భాగస్వాములను చేసింది.

పెద్ద పీట వేశారిలా..

- ఉమ్మడి **తూర్పు గోదావరి జిల్లాలో నామినేటెడ్** పదవుల కేటాయింపులో ఎస్సీ, బీసీలకు పెద్దపీట వేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీని నూరు శాతం అమలు చేసి చూపించారు.
- ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి మంత్రి పదవులు ఇవ్వగా.. అందులో చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ (బీసీ), పినిపే విశ్వరూప్, తానేటి వనిత(ఎస్సీ)లకు ప్రాతినిధ్యం కల్పించారు. ఎస్సీల్లో అందునా మహిళ అయిన వనితకు కీలకమైన హోం శాఖ అప్పగించారు.
- ఉమ్మడి జిల్లా చరిత్రలోనే తొలిసారిగా పెద్దల సభ అయిన రాజ్యసభలో బీసీ వర్గాల నుంచి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌కు ప్రాతినిధ్యం కల్పించారు. రూ.కోట్లు ముట్టజెప్పిన వారికే ఇటువంటి పెద్దపెద్ద పదవులు దక్కుతాయనే గత పాలకుల విధానాలకు భిన్నంగా బోస్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. అదే టీడీపీలో చంద్రబాబు తరువాత నంబర్-2 అని చెప్పుకొనే యనమల రామకృష్ణుడికి రాజ్యసభకు వెళ్లాలనే చిరకాల కోరిక ఇప్పటికీ కలగానే మిగిలిపోవడం గమనార్హం.
- ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని ఎస్సీ సామాజికవర్గం నుంచి విద్యావంతుడైన నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఎస్ఈ విప్పర్తి వేణుగోపాలరావుకు కేటాయించారు.
- నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసి, పక్కాగా అమలు చేశారు.
- ఇటీవల శాసన మండలి సభ్యుల భర్తీలో కూడా బీసీ, ఎస్సీలకు పెద్దపీట వేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బీసీ, ఎస్సీ సామాజికవర్గాల నుంచి కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, కాకినాడ నుంచి కర్రి పద్మశ్రీని ఎమ్మెల్సీలను చేశారు. మాదిగ సామాజికవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్సీ ఇచ్చిన చరిత్ర వైఎస్సార్ సీపీకే దక్కుతుంది.
- రాష్ట్ర స్థాయిలో పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల కేటాయింపులో బీసీ, ఎస్సీలకే అగ్రాసనం వేశారు. వారిలో కూడా ఉమ్మడి జిల్లా నుంచి మహిళలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు.
- తూర్పు గోదావరి జిల్లా నుంచి రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా సంకిన భవానీప్రియ, కోనసీమ జిల్లా నుంచి రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్‌గా కుడుపూడి సత్యశైలజ, రాజమహేంద్రవరం హితకారిణి సమాజం చైర్‌పర్సన్‌గా కాశి బాలముని కుమారి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్‌గా కుడుపూడి బాబు, కాకినాడ జిల్లా నుంచి సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ ప్రభావతి, అయ్యరక, మాల కార్పొరేషన్ల చైర్‌పర్సన్లుగా ఆవాల రాజేశ్వరి, పెదపాటి అమ్మాజీ, రాజమహేంద్రవరం నుంచి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా చందన నాగేశ్వర్, అతిరాస కార్పొరేషన్ చైర్మన్‌గా ఇళ్ల భాస్కరరావు.. ఇలా బీసీ, ఎస్సీలకు అన్నింటా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది.



సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభకు ముస్తాబైన సర్పవరం జంక్షన్

ఉమ్మడి 'తూర్పు'న తొలిగా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 53 నెలల కాలంలో ఆయా వర్గాలకు చేసిన ఈ తరహా మేలును వివరించేందుకు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలోనే తొలిసారిగా కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో సోమవారం ఈ బస్సు యాత్ర జరగనుంది. ఈ సందర్భంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయా వర్గాలకు కల్పించిన ప్రాధాన్యాన్ని ప్రజాప్రతినిధులు వివరించనున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా సాధికారత



బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సామాజిక సాధికారతను ఆచరణలో నిజం చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా వర్గాల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. దేశంలోని దాదాపు అన్ని పార్టీలూ బీసీలను ఓటు బ్యాంక్ రాజకీయాలకే పరిమితం చేశాయి. అందుకు పూర్తి భిన్నంగా నాలుగున్నరేళ్ల కాలంలో ఆయా వర్గాలను మిగిలిన వర్గాలకు దీటుగా ఆర్థికంగా, సామాజికంగా బలీయమైన శక్తిగా తీర్చిదిద్దిన ఘనత సీఎంకే దక్కుతుంది. ఈ నాలుగున్నరేళ్లలో ఏనాడూ ఆయా వర్గాలను ఓటు బ్యాంకుగా భావించలేదు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బీసీ కులగణనకు శ్రీకారం చుట్టడం సాహసోపేతమైన నిర్ణయం.

– కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే, కాకినాడ రూరల్, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు

తరలిరానున్న అతిరథ మహారథులు

ఈ సామాజిక సాధికార బస్సు యాత్రకు వైఎస్సార్ సీపీకి చెందిన అతిరథ మహారథులు హాజరు కానున్నారు. బీసీ, ఎస్సీ వర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఉమ్మడి జిల్లా నుంచి పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారు. వీరందరూ సోమవారం ఉదయం కాకినాడ ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. వీరిని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజికవర్గాల ప్రతినిధులు కలవనున్నారు. ఈ సందర్భంగా మంత్రులు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడతారు. అనంతరం అక్కడి నుంచి భానుగుడి మీదుగా సర్పవరం జంక్షన్ వరకూ ర్యాలీగా బస్సు యాత్ర సాగనుంది. సాయంత్రం 4 గంటలకు సర్పవరం జంక్షన్‌లో సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు విస్తృత ఏర్పాట్లు చేశారు. సభాస్థలి, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, డీఎస్పీలు మురళీకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు ఆదివారం పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

బస్సు యాత్రను మహిళలు విజయవంతం చేయాలి



వర్ధినీడి సుజాత

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో సోమవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత మహిళలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సామాజిక సాధికారతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధ్యం చేసి చూపారని అన్నారు. ఈ కృషిని వివరించేందుకే బస్సు యాత్ర జరుగుతోందని చెప్పారు. జిల్లాలో తొలిసారిగా రూరల్ నియోజవర్గంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సారథ్యంలో జరిగే ఈ బహిరంగ సభలో అన్ని వర్గాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

లోవ దేవస్థానంలో భక్తుల రద్దీ



లోవ ప్రాంగణంలో నెలకొన్ని భక్తుల రద్దీ

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ ఏర్పడింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,60,455, పూజా టికెట్లకు రూ.1,87,650, కేశఖండన శాలకు రూ.11,200, వాహన పూజలకు రూ.3,950, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.89,056, విరాళాలుగా రూ.2,07,437 కలిపి అమ్మవారికి మొత్తం రూ.6,59,698 ఆదాయం సమకూరిందని వివరించారు. శ్రీవారి సేవకులు, సిబ్బందితో కలసి భక్తుల సౌకర్యాలను ఈఓ విశ్వనాథరాజు పర్యవేక్షించారు.

నేడు యథావిధిగా స్పందన

కాకినాడ సిటీ: జగనన్నకు చెబుదాం, జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుంది. కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు దీనిని గమనించాలని కోరారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలి



మీడియాతో మాట్లాడుతున్న ముస్లిం నేత బాషా తదితరులు

ముస్లిం మైనార్టీ నేతల పిలుపు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం జంక్షన్‌లో సోమవారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ముస్లిం మైనార్టీ నేతలు కోరారు. రమణయ్యపేట వైద్య నగర్‌లోని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీం బాషా ఆదివారం మీడియాతో మాట్లాడారు. సర్పవరం జంక్షన్ వద్ద మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న బస్సు యాత్ర బహిరంగ సభకు ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, సాధికారతకు అర్థం చెప్పేలా పాలన సాగిస్తున్నారని అన్నారు. మసీదు కుబా సెక్రటరీ ఎండీ సంధానీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు మైనార్టీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి, వారి సంక్షేమానికి రూ.21 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజమ్‌లకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తోందని చెప్పారు. సమావేశంలో వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రహమాన్ ఖాన్, పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ఎండీ బాషా, ఏఎంసీ డైరెక్టర్ నౌషాద్, రాష్ట్ర బీసీ సెల్ డైరెక్టర్ అనసూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో పరిఢవిల్లుతున్న దళిత సంక్షేమం

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో దళిత సంక్షేమం పరిఢవిల్లుతోందని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లోని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన, ఎస్సీ నాయకులు మీడియాతో మాట్లాడారు. సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జంగా గగారిన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఏడుకొండలు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రాన్ని సీఎం జగన్ అభివృద్ధి వైపు నడుపుతున్నారని అన్నారు. ప్రతి దళిత కుటుంబం బాగుందని, అనేక సంక్షేమ పథకాలు అందాయని, వారు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారని చెప్పారు. అంబేడ్కర్ స్ఫూర్తితో విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. 175 నియోజవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం కోసం పాటు పడతామన్నారు. డీసీసీబీ మాజీ సభ్యుడు గుడాల రామకృష్ణ మాట్లాడుతూ, సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతంలో దళితులు ముందు వరుసలో ఉంటారని అన్నారు. వైస్ ఎంపీపీ బందిలి వీరేష మాట్లాడుతూ, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నాయకత్వంలో బస్సు యాత్రను విజయవంతం చేస్తామన్నారు. దళితులు వైఎస్సార్ సీపీ పక్షమని పార్టీ మండల ఎస్సీ సెల్ నాయకుడు దేవరాజు అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఏడుకొండలు తదితరులు

ట్రాఫిక్ మళ్లింపు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా కాకినాడ నగరంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నారు. అన్ని భారీ వాహనాలను అచ్చంపేట జంక్షన్ నుంచి ఏడీబీ రోడ్డులో ఉండూరు వైపు, లైట్‌హౌస్ వైపు మళ్లిస్తున్నారు. కాకినాడ డీఎస్పీ పి.మురళీకృష్ణారెడ్డి ఆదివారం ఈ వివరాలు తెలిపారు.

- సర్పవరం జంక్షన్ మీదుగా వెళ్లే వాహనాలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వివిధ మార్గాల్లోకి మళ్లిస్తున్నారు.
- భానుగుడి జంక్షన్ నుంచి సర్పవరం జంక్షన్ మీదుగా వెళ్లే వాహనాలను నాగమల్లితోట జంక్షన్ నుంచి ఆర్‌టీఓ ఆఫీసు రోడ్డు మీదుగా గంగరాజు నగర్ టి–జంక్షన్ వలసపాకల, వాకలపూడి మీదుగా ఏడీబీ రోడ్డుకు వెళ్లాలి.
- పిఠాపురం వైపు నుంచి సర్పవరం జంక్షన్‌కు వచ్చే వాహనాలను అచ్చంపేట జంక్షన్ వద్ద ఏడీబీ రోడ్డు నుంచి కోరమండల్ మీదుగా వలసపాకల, గంగరాజు నగర్ టి–జంక్షన్ మీదుగా ఆర్‌టీఓ ఆఫీస్ రోడ్డుకు చేరాలి.
- మాధవపట్నం, పనసపాడు నుంచి సర్పవరం గ్రామం మీదుగా సర్పవరం జంక్షన్‌కు వచ్చే వాహనాలను గైగోలుపాడు జంక్షన్ నుంచి కరణంగారి జంక్షన్‌కు చేరుకోవాలి.
- వలసపాకల, వాకలపూడి నుంచి రమణయ్యపేట మీదుగా సర్పవరం జంక్షన్‌కు వచ్చే వాహనాలు గంగరాజు నగర్ టి–జంక్షన్ నుంచి ఆర్‌టీఓ ఆఫీస్ రోడ్డు మీదుగా వెళ్లాలి.
- పిఠాపురం వైపు నుంచి సర్పవరం జంక్షన్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు అచ్చంపేట జంక్షన్ నుంచి లైట్‌హౌస్ మీదుగా కోరమండల్, వలసపాకల నుంచి గంగరాజు నగర్ టి–జంక్షన్ మీదుగా ఆర్‌టీఓ ఆఫీస్ రోడ్డుకు చేరుకోవాలి.
- కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సర్పవరం జంక్షన్ మీదుగా వెళ్లే బస్సులు కోకిల సెంటర్ నుంచి ఆర్ఎంసీ మెన్స్ హాస్టల్ మీదుగా కమ్మ కల్యాణ మండపం, ఆర్‌టీఓ ఆఫీస్ రోడ్డు మీదుగా గంగరాజు నగర్ టి–జంక్షన్, వలసపాకల, వాకలపూడి మీదుగా ఏడీబీ రోడ్డుకు చేరుకోవాలి.

ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ తల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో అమ్మవారికి రూ.1,87,593 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

పాడిరైతుల ఆర్థికాభ్యున్నతికి చేయూత

- కృత్రిమ గర్భధారణ పద్ధతిలో పిండోత్పత్తి
- పెయ్యల జననానికి 6 వేల ఇంజెక్షన్లు సిద్ధం
- ఒక్కో డోసుపై ప్రభుత్వం రూ.850 రాయితీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పాడి రైతుల అభ్యున్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే గ్రామాల్లో అమూల్ పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసింది. మరో పక్క కృత్రిమ పద్ధతిలో ఇంజెక్షన్ల ద్వారా పెయ్యదూడల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. తద్వారా పాడి పరిశ్రమను బలోపేతం చేయాలని సంకల్పించింది. ఆవులు, గేదెలు గతంలో చూలు కట్టాలంటే ఎద్దులు, దున్నలపై ఆధారపడాల్సి వచ్చేది. తర్వాత కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా పశువు గర్భం దాల్చి ఏదో ఒక దూడకు జన్మనిస్తే చాలని రైతులు అనుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. పెయ్యదూడ కావాలనుకున్న వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఇంజెక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 'పెయ్యదూడలు పుట్టాలి – రైతన్నకు లక్ష్మీకళ రావాలి' అనే లక్ష్యంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యాన పెయ్య దూడల ఉత్పత్తి పథకం అమలు చేస్తోంది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఈ నెల 1 నుంచి ఇంజెక్షన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

కృత్రిమ గర్భధారణ

రైతులకు పాడి పంటలు రెండు కళ్ల లాంటివి. ఇవి ఒక దానిపై మరొకటి ఆధారపడి రైతుల అభివృద్ధికి దోహదపడతాయి. కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యం ఏర్పడటంతో పాడి పరిశ్రమలో మగ జాతి పశువులకు ప్రాధాన్యం తగ్గింది. దీంతో ప్రతి రైతూ తమ ఇంట పెయ్య పుడితే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని భావిస్తున్నారు. వారి ఆకాంక్షలను నిజం చేసేందుకు ప్రభుత్వం పెయ్యదూడల జననానికి కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది.



కృత్రిమ గర్భధారణ పద్ధతిలో పుట్టిన పెయ్యదూడ

ప్రాంతీయ పశువైద్య ఆసుపత్రులు	56
పశువైద్యశాలలు	10
గ్రామీణ పశువైద్య కేంద్రాలు	54
కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రాలు	201

జిల్లాలో 6 వేల డోసులు

పాడి పశువుల కృత్రిమ గర్భధారణకు జిల్లా వ్యాప్తంగా 6 వేల డోసుల ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచామని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. వీటిని ఆయా పశు వైద్య కేంద్రాల వద్ద పాడి రైతులు పొందవచ్చునన్నారు. ఒక్క డోసుపై ప్రభుత్వానికి రూ.1,350 ఖర్చవుతుండగా ప్రభుత్వం రైతులకు రూ.850 సబ్సిడీ ఇస్తుంది. రైతులు రూ.500 చెల్లించి ఈ ఇంజెక్షన్‌ను తమ పశువులకు వేయించుకోవచ్చు. తద్వారా మేలుజాతి పెయ్యదూడలు జన్మించి పాడి పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడుతుంది.

ఫలించకపోతే నగదు వాపసు



పెయ్యదూడలు కావాల్సిన రైతులు రూ.500 చెల్లించి ఆవుకుగానీ, గేదెకుగానీ ఇంజక్షన్ వేయించుకోవచ్చు. ఒకసారి తప్పితే రెండోసారి ఇంజక్షన్ వేస్తారు. వైద్యుల సూచనల మేరకు వాటిని పర్యవేక్షించాలి. అప్పటికీ చూలు నిలబడకపోతే నగదు వాపసు ఇచ్చేస్తారు. పాడి రైతులకు ఇదొక చక్కని అవకాశం.

– యార్ల దొరబాబు, చైర్మన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో ఎదకు వచ్చిన ఆవులు, గేదెలకు ఇంజెక్షన్లు వేయించాలి. గత ఏడాది 2,212 సెమన్ డోసులు సరఫరా చేశాం. ఈ ఏడాది 6 వేల కృత్రిమ గర్భధారణ డోసులు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆయా పశు వైద్య కేంద్రాల్లో అందించనున్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– డీబీఆర్ అంబేద్కర్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి

క్లుప్తంగా

జాతీయ స్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక


లీలాసాయి ప్రసన్న


ఓరుగంటి సాహితీశ్రీ

దేవరపల్లి: రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్ అండర్- 15 విభాగంలో అత్యంత ప్రతిభ చూపిన దేవరపల్లి అంబటి సత్యనారాయణ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. అక్టోబర్ 16 నుంచి 21 వరకూ మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కుక్కల లీలాసాయి ప్రసన్న, ఓరుగంటి సాహితీశ్రీ జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైనట్టు ఫిజికల్ డైరెక్టర్ ఓరుగుంటి నాగరాజు ఆదివారం తెలిపారు. రాష్ట్ర జట్టుకు 22 మంది క్రీడాకారిణులు ఎంపిక కాగా, ఇందులో దేవరపల్లికి చెందిన ఈ ఇద్దరు విద్యార్థినులు ఉన్నారని తెలిపారు. ఈ నెల 17 నుంచి 27 వరకూ డెహ్రాడూన్‌లో జరగనున్న జాతీయస్థాయి టోర్నమెంట్‌లో లీలాసాయి ప్రసన్న, సాహితీశ్రీ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు


టిఫిన్స్ హోటల్‌లో వంట నూనెను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలోని పలు హోటళ్లపై ఆదివారం రాత్రి ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక స్మార్ట్ సిటీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఎదురుగా ఉన్న డాక్టర్స్ ఫుడ్ ప్లాజాపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. ఈ హోటల్‌కు అనుమతులు తీసుకోకుండా ఇక్కడ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆహారం తయారీకి వినియోగించే పలు ఆహార పదార్థాలు పురుగులు పట్టి ఉండడాన్ని అధికారులు గుర్తించారు. వంటశాల అపరిశుభ్రంగా ఉండటంతో అధికారులు ఆహార పదార్థాల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతామన్నారు. హోటల్ యజమానికి నోటీసులు ఇచ్చారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయం ఎదురుగా జెమిని టిఫిన్స్ హోటల్‌లో అధికారులు దాడులు నిర్వహించారు. వంట నూనెల శాంపిల్స్ తీయగా రీడింగ్ ఎక్కువగా ఉండటంతో నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశారు. వంటశాల సక్రమంగా లేకపోవడంతో పరిశుభ్రంగా ఉంచాలని హెచ్చరించారు.

సర్వాంతర్యామి... సదా స్మరామి


స్వామివారికి అభిషేకాలు చేస్తున్న పండితులు

- రమణీయంగా నందనందుని కల్యాణం
- భక్తజనంతో పోటెత్తిన వాడపల్లి క్షేత్రం
- కనులపండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం: శ్రీ శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా గోవిందా.. నిత్య కల్యాణ గోవిందా.. నీల మేఘశ్యామ గోవిందా.. అంటూ ఆ నందనందుడిని భక్తులు మనసారా కొలిచారు. ఆ సర్వాంతర్యామిని సదా స్మరించారు.. కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలను తిలకించిన భక్తులు ఆనంద పరవశంలో మునిగి తేలారు. ఆదివారం భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ నిర్వహించారు. తీర్థబిందెలతో గోదావరి జలాలను తీసుకువచ్చి అభిషేకాలతో పాటు గోత్రనామాలతో పూజలు, నిత్య హోమాలు చేశారు. అనంతరం నివేదన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వినియోగం చేశారు. ఉదయం 8 గంటల నుంచి స్వామివారి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ పూజలను వేద పండితులు వైఖానస యువ బ్రహ్మ ఆగమ భాస్కర ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ స్వామివారిని యోగ నారసింహ అలంకరణలో సింహ వాహనంపై ఊరేగించారు. కేరళ కళాకారుల వాయిద్యాలు, కోలాటం భక్తులను అలరించాయి.


అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పట్టువస్త్రాల సమర్పణ

స్వామివారి ఆలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, లావణ్య దంపతులు దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, ప్రధాన హోమాలు, జగత్ కల్యాణార్థం శ్రీనివాస కల్యాణం, నీరాజనం, మంత్రపుష్పాలు, సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, స్వామివారికి విశేష అర్చన, చతుర్వేద స్వస్తి, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. అనంతరం యోగ నారసింహ అలంకరణలో సింహ వాహనంపై స్వామివారు ఊరేగారు.


యోగ నారసింహ అలంకరణలో సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు

సింహ వాహన సేవ విశిష్టత

స్వామివారు సింహ వాహన సేవలో వజ్ర ఖచిత కిరీటంతో సకల ఆభరణాలతో అలంకృతమై ఉంటారు. జంతు జాలానికి రాజైన సింహాన్ని మృగత్వానికి ప్రతీకగా భావిస్తారు. ప్రతి మనిషి తమలలోని మృగత్వాన్ని సంపూర్ణంగా అణిచి ఉంచాలని తలపైన ఆది దేవుడిని ధరించాలని చెప్పే ప్రతీకగా ఈ సింహ వాహనంపై స్వామివారు ఊరేగుతారని భక్తులు భావిస్తారు.


శ్రీనివాసుని కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, లావణ్య దంపతులు

నేటి కార్యక్రమాలివీ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు ఉంటాయి. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అష్టకలశారాధన, మహాస్నాపం, తోమాల సేవ, ప్రధాన హోమాలు, మహా సుదర్శన హోమం, నీరాజన మంత్రపుష్పాలు జరుగుతాయి. సాయంత్రం స్వస్తి వచనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, నీరాజనం ఉంటాయి. అనంతరం మలయప్ప అలంకరణతో గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

అందివస్తే అలంకారమే..

- అమ్మవారికి వజ్ర కిరీటం తయారీలో జాప్యం
- చర్చిస్తే సమస్య పరిష్కారం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని సత్యదేవుడు వజ్రకిరీటం ధరించి ప్రకాశిస్తుంటే పక్కనే ఉన్న అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు మాత్రం పాత స్వర్ణ కిరీటంతోనే దర్శనమిస్తుండటం భక్తులను అసంతృప్తికి గురిచేస్తోంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, పెద్దాపురంలోని శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ సత్యదేవునికి సుమారు రూ. కోటితో వజ్రకిరీటం చేయించిన విషయం విదితమే. దీనిని గత ఏడాది ఆగస్టులో స్వామివారికి అందజేశారు. దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి కూడా వజ్రకిరీటం చేయిస్తానని ఆ దాత ప్రకటించారు. సుమారు 15 నెలలు గడిచినా ఇంకా కిరీటం సమకూరలేదు. వజ్రకిరీటం అమ్మవారికి శాశ్వతంగా అలంకరించాలనేది దాత మట్టే సత్యప్రసాద్ కోరిక. ఇందుకు దేవదాయ శాఖ నిబంధనలు అంగీకరించవని, నిర్దిష్ట కాలపరిమితి ముగిసిన తర్వాత ఇంతకన్నా ఎక్కువ వ్యయంతో పెద్ద కిరీటం మరో దాత తయారు చేయిస్తే అప్పుడు దాతతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. దీనిపై దాత సత్యప్రసాద్ కొంత అసంతృప్తికి గురైనట్లు సమాచారం. ఫలితంగా కిరీటం తయారీ ఆలస్యం అవుతుందని చెబుతున్నారు. ఈ చిన్న సమస్యపై అటు దాత, ఇటు దేవస్థానం అధికారులు చర్చిస్తే పరిష్కారం అవుతుందనే అభిప్రాయం అందరిలో వ్యక్తమవుతోంది. అదే జరిగితే కార్తిక మాసంలోనే వజ్రకిరీటంతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సరికొత్త అలంకరణలో..

దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ స్వామి, అమ్మవార్లకు ఎన్నో ప్రత్యేక అలంకరణలు చేయిస్తున్నారు. ప్రతి సోమవారం ముత్యాల వస్త్రాలంకరణతో 'ముత్తంగి సేవ', గురువారం స్వామివారి నిజరూప దర్శనం, ప్రదక్షిణ దర్శన మార్గంలో స్వర్ణ గంధం గిన్నె, స్వర్ణ హుండీ, స్వర్ణ కల్పవృక్షం, స్వర్ణ కామధేనువు ఏర్పాటు చేయడంతో భక్తులు ఆనంద పరవశితులవుతున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన దాత సహకారంతో జనవరిలో స్వామివారికి స్వర్ణ రేకు అలంకరణతో నూతన ధ్వజస్తంభం కూడా ఏర్పాటు కానుంది. ఇదే సమయంలో అమ్మవారికి వజ్రకిరీటం కూడా తయారు చేయిస్తే బాగుంటుందని భక్తులు భావిస్తున్నారు.


సత్యదేవునికి దాత మట్టే సత్యప్రసాద్ తయారు చేయించిన వజ్ర కిరీటం

కిరీటం తయారీకి కట్టుబడి ఉన్నా



సత్యదేవునికి వజ్ర కిరీటం చేయించినట్టే అమ్మవారికి కూడా వజ్రకిరీటం చేయిస్తాను. అది నాకు మొక్కుతో సమానం. దానిని తప్పక నెరవేరుస్తాను. ఆ వజ్రకిరీటం స్వామివారికి అలంకరించినట్టుగానే అమ్మవారికీ అలంకరించాలని కోరిక. ఆ మేరకు అధికారులు లిఖితపూర్వకంగా హామీ ఇస్తే చాలు. దేవదాయశాఖ నిబంధనల మేరకే వ్యవహరించాలని కోరుకుంటున్నాను.

– మట్టే సత్యప్రసాద్, దాత

ఎటువంటి అభ్యంతరం లేదు..



దాత మట్టే సత్యప్రసాద్ అమ్మవారికి వజ్ర కిరీటం చేయిస్తే దానిని అలంకరించడానికి ఎటువంటి అభ్యంతరం లేదు. భవిష్యత్తులో మరో దాత ఎవరైనా ఇంతకన్నా పెద్ద కిరీటం చేయిస్తే అప్పుడు కూడా మట్టే సత్యప్రసాద్‌తో చర్చించి వారి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటాం. పెద్ద కిరీటం మరో దాత చేయించకపోతే దేవదాయశాఖ నిబంధనల మేరకు వీరి కిరీటమే అమ్మవారికి అలంకరిస్తాం.

– చంద్రశేఖర్ అజాద్, దేవస్థానం ఈఓ

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

తుని రూరల్: కొత్త సూరవరం సచివాలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (35) లభ్యమైందని రూరల్ ఎస్సై విజయబాబు ఆదివారం తెలిపారు. ఆ మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు. తెలుపు వర్ణంలో ఉన్న మృతుడి ఎత్తు ఐదడుగుల ఆరు అంగుళాలు ఉందన్నారు. నీలం రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, బిస్కెట్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. ఆ వ్యక్తి వివరాలు తెలియ రాలేదన్నారు. ఎవరైనా గుర్తిస్తే 94407 96573 నంబరుకు తెలియజేయాలన్నారు.

చోరీలు చేశాడు.. చివరికి చిక్కాడు

- ఏడాదిలో 13 దొంగతనాలు
- రూ.25 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ


రికవరీ చేసిన బంగారాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: ఆ యువకుడు చోరీలు చేయడంలో ఆరితేరాడు.. దోచేసిన సొమ్ముతో హాయిగా జల్సా చేసేవాడు.. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు.. ఆదివారం ఈ వివరాలను కాకినాడలోని పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామానికి చెందిన చిలపనశెట్టి సన్యాసిరావు (33) దొంగతనాల్లో ఆరితేరాడు. గతంలో చేసిన ఎనిమిది దొంగతనాలకు సంబంధించి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవించినా ఎటువంటి మార్పు రాలేదు. ఏడాది కాలంలో మళ్లీ జిల్లా వ్యాప్తంగా 13 చోట్ల చోరీలకు పాల్పడ్డాడు. ఈ నేరాలన్నీ ఏలేశ్వరం, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురం, ప్రత్తిపాడు, కిర్లంపూడి, అడ్డతీగల పరిధిలోనే చేశాడు. సునాయాసంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సన్యాసిరావు దొంగతనాలకు పాల్పడేవాడు. దీనికి అతని తండ్రి ఏసుబాబు సహకరించేవాడు. ఇలా ఏడాది కాలంలో చేసిన దొంగతనాల్లో 471.4 గ్రాముల బంగారు ఆభరణాలు దోచేశాడు. ఈ బంగారాన్ని ఏలేశ్వరంలోని ఎస్‌బీఐ, సీఎస్‌బీ, యూనియన్ బ్యాంకు, ముత్తూట్, మణప్పురం ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టాడు. దోచిన సొత్తును తన స్నేహితులు తండ్రి సాయంతో బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి తనఖా పెట్టి వచ్చిన సొత్తుతో జల్సా చేశాడు. సన్యాసిరావుకు సహకరించిన అతడి తండ్రి ఏసుబాబు, తరోజ నాగదుర్గ, మిడతది అఖిల్ కుమార్, కొల్లూరి చిట్టిబాబుల పైనా కేసు నమోదు చేశారు. అలాగే విచారణకు సహకరించకుండా బ్రాంచ్‌కు తాళాలు వేశారనే ఆరోపణతో ఏలేశ్వరం మణప్పురం ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ అధికారులు, సంస్థపైనా కేసు నమోదైంది. ఇదిలాఉంటే నిందితుడు తాకట్టు పెట్టిన రూ.25 లక్షల విలువైన బంగారాన్ని వివిధ సంస్థల నుంచి సేకరించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో బృందం కేసు విచారణ చేపట్టి నిందితుడిని పట్టుకుందని ఎస్పీ వివరించారు. ప్రత్తిపాడు సీఐ శేఖర్‌బాబు, క్రైం సీఐ కిశోర్‌బాబు, ఏలేశ్వరం ఎస్ఐ సతీష్, బృందం కీలకంగా వ్యవహరించిందని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 6.9 మి.మీ. వర్షపాతం

కొవ్వూరు: తూర్పుగోదావరి జిలాలో ఆదివారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో 6.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం రూరల్‌లో గరిష్ఠంగా 55.6, కడియంలో 28.6, రాజమహేంద్రవరం అర్బన్‌లో 19.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉండ్రాజవరం, కొవ్వూరు, పెరవలి, నిడదవోలు, సీతానగరం, రాజానగరం మండలాల్లో చినుకులు పడ్డాయి.

తీర ప్రాంతాలకు కాళరాత్రది


1996లో అతిపెద్ద తుపానుకు నేలకొరిగిన కొబ్బరి చెట్లు (ఫైల్)


రహదారిపై పడిపోయిన విద్యుత్తు స్తంభం (ఫైల్)

అతిపెద్ద తుపానుకు 27 ఏళ్లు పూర్తి

యానాం: 1996, నవంబర్ 6.. యానాం, కోనసీమ ప్రాంతాల ప్రజలు మర్చిపోలేని రోజుగా చరిత్రలో నిలిచిపోయింది. కోనసీమను అతలాకుతలం చేసిన అతి పెద్ద తుపాను వచ్చిన రోజది. ఇప్పటికి ఆ తుపాను వచ్చి 27 ఏళ్లు పూర్తయింది. ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి అమిత వేగంతో గాలులు వీచాయి. ఈ తుపానుతో యానాం, తాళ్లరేవు మండలాలతో పాటు కోనసీమ ప్రాంతంలో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరిగింది. సుమారు 215 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు యానాం నియోజకవర్గంలోని వేలాది ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. వేలాది కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. అక్టోబర్ చివరి వారంలో పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం అండమాన్ నికోబార్ దీవుల మీదుగా సాగి బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్టోబర్ 5 నాటికి తుపాను తీవ్రత పెరిగింది. అది కాస్తా తుపాన్‌గా మారి నవంబర్ 6న కాకినాడ- యానాం మధ్య తీరాన్ని తాకింది. ఐ.పోలవరం మండలం భైరవపాలెం, బలుసుతిప్ప గ్రామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆయా గ్రామాలకు అప్పట్లో ముందస్తు వాతావరణ హెచ్చరికలు అందక 90 శాతం మత్స్యకారుల పడవలు ధ్వంసమయ్యాయి. అనేకమంది మత్స్యకారులు సముద్రంలో కొట్టుకుపోయి మృతి చెందారు. ఈ తుపాన్ కారణంగా 1,077 మంది మరణించారు. 241,802 హెక్టార్లలో పంటలు నాశనం అయ్యాయి. 2.33 లక్షల కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. 40 వేలకు పైగా ఇళ్లు నాశనమయ్యాయి. 78 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యానాం- కాకినాడ మధ్య రహదారిలో కూకటివేళ్లతో చెట్లు నేలకొరగడంతో అనేక రోజుల పాటు రవాణా వ్యవస్థ స్తంభించింది. యానాంలో అనేక పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఇప్పటికి ఆ కాళరాత్రి గురించి స్థానికులు చెబుతుంటారు.

ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీల తేదీలు ఖరారు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17, 19 ఆధ్వర్యంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగే అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీల తేదీలు ఖరారయ్యాయని జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకూ నెట్‌బాల్ అండర్-17 బాలుర, బాలికల పోటీలు ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, వాలీబాల్ అండర్-14 విభాగంలో అరకువ్యాలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, బ్యాడ్మింటన్ పోటీలు అండర్-14, 17 విభాగాల్లో విశాఖ స్వర్ణభారతి స్టేడియంలో, ఖోఖో అండర్-14 పోటీలు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో, బాస్కెట్‌బాల్ అండర్-14 పోటీలు అన్నమయ్య జిల్లా అంగల్లులో జరుగుతాయన్నారు. కరాటే అండర్-14, 17 బాలుర, బాలికల పోటీలు పార్వతీపురం మన్యం జిల్లా జోగింపేట ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో, సాఫ్ట్‌టెన్నిస్ బాల్ పోటీలు పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ స్కూల్‌లో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఈ నెల 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా చింతయ్యపాలెంలో అండర్-14, 17 సైక్లింగ్, మల్లకాంబ్ పోటీలు జరుగుతాయన్నారు. 11 నుంచి 13 వరకూ చెస్ పోటీలు ఏలూరు ఏపీ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో అండర్-14, 17 విభాగాల్లో ఉంటాయని ప్రసాద్ వివరించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు


అండర్- 15 చదరంగం పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఎంకే చెస్ అకాడమీ పర్యవేక్షణలో బాలల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఐరన్ పెయింట్స్ అసోసియేషన్ హాలులో అండర్-15 విభాగంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో ఏడు రౌండ్లు, బాలికల విభాగంలో ఐదు రౌండ్‌లో ఈ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో ఎం.రామ్‌చరణ్ తేజ, భార్గవ సుశాంత్ సాకేత్, జి.హరిచరణ్, కె.ముఖేష్, కె.శ్రీఇషాంత్ విజయం సాధించారు. బాలికల విభాగంలో చంద్రజ, ఎండీ హబీబా, కె.రష్మీ, టి.తన్మయి, ఎండీ దబ్బసుమ్‌లు విజేతలుగా నిలిచారు. మొదటి ఐదు స్థానాల విజేతలకు రూ.పది వేల నగదు బహుమతితో పాటు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో బత్తుల శ్రీరాములు, వై.కల్యాణ్‌కుమార్, బత్తుల కృష్ణ, జీవీ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు కార్తీక్


కార్తీక్ రామచంద్రారెడ్డిని అభినందిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ యోగా పోటీల్లో రాజమహేంద్రవరం నగరానికి చెందిన కర్రి కార్తీక్ రామచంద్రారెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్‌లో స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ స్కూల్ 8వ తరగతి విద్యార్థి కార్తీక్ రామచంద్రారెడ్డి అండర్-14 బాలుర ప్రాథమిక విభాగంలో ప్రథమ స్థానం సాధించాడు. కార్తీక్ తండ్రి నేషనల్ యోగా కోచ్, యోగా జడ్జి కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి. అతని వద్ద ఎనిమిదో ఏట నుంచి యోగాలో శిక్షణ పొందుతూ వరుసగా రెండో సారి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్తీక్ రామచంద్రారెడ్డిని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఆదివారం అభినందించారు. డిసెంబర్‌లో అగర్తలాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.